# అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమించా..


ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ రోడ్‌షోకు కదిలివచ్చిన ప్రజలు

- ప్రత్యేక ప్రణాళికతో ఖమ్మం మొత్తాన్ని ఒకే మాదిరిగా తీర్చిదిద్దా..
- అభివృద్ధి కాముకుడిని కాబట్టే కాలుకు బలపం కట్టుకొని తిరిగా..
- కష్టనష్టాల్లో తోడుగా నిలిచిందెవరో ఖమ్మం ప్రజలకు తెలుసు..
- సుఖదుఖ్ఖాల్లో ఏనాడూ లేని తుమ్మలకు ఖమ్మం ఓట్లు కావాలంట..
- నగర రోడ్ షోలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 18 : ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను అహర్నిశలూ శ్రమించానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఖమ్మం మొత్తాన్ని ఒకే మాదిరిగా తీర్చిదిద్దానని స్పష్టం చేశారు. అభివృద్ధి కాముకుడిని కాబట్టే కాలుకు బలపం కట్టుకొని మరీ నగరంలో తిరిగానని అన్నారు. కష్టనష్టాల్లో తోడునీడగా నిలుచిందెవరో ఖమ్మం ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. ఖమ్మం ప్రజల సుఖదుఖ్ఖాల్లో ఏనాడూ లేని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం ప్రజల ఓట్లు కావాలంట అని విమర్శించారు. ఖమ్మం నగరంలో శనివారం పర్యటించిన ఆయన.. 16, 17, 27 డివిజన్లలో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు ఇన్నేళ్లలో ఏనాడైనా ఖమ్మం వైపుగానీ, అందులో ఉన్న శ్రీనివాసనగర్ వైపుగానీ కన్నెత్తయినా చూశారా? అని ప్రశ్నించారు. ఇక్కడి పెళ్లిలోనూ, చావులోనూ లేరని, మున్నేరు వరదలప్పుడూ లేరని, చివరికి కరోనా సమయంలోనూ కన్పించలేదని దుయ్యబట్టారు. ప్రజల సుఖదుఖ్ఖాల్లో ఏనాడూ కన్పించని తుమ్మలకు ఇప్పుడు ఖమ్మం ప్రజల ఓట్లు ఎందుకని ప్రశ్నించారు. 'పాలేరులో టికెట్ ఇవ్వలేదు కాబట్టి ఖమ్మంలో టికెట్ ఇవ్వాలంటడు. సత్తుపల్లిలో ఓడిపోతే ఖమ్మం వస్తాడు. ఖమ్మంలో ఓడిపోతే పాలేరు వెళ్తాడు. పాలేరులో ఓడిపోతే మళ్లీ ఖమ్మం వచ్చాడు..' అంటూ ధ్వజమెత్తారు. మట్టి తెచ్చేందుకైనా ఇంటోడు వెళ్లాలంటూ పెద్దలంటుంటారని గుర్తుచేశారు. ఆ ప్రకారమే ఖమ్మం ఇంటివాడినైన తనను మరోసారి ఆదరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్‌జేసీ కృష్ణ, ధనాల రాధ, పాలడుగు పాపారావు, రామకృష్ణ, ధనాల శ్రీకాంత్, నున్నా మాధవరావు, మెంతుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

# నేడు యువనేత పర్యటన

### నాలుగు నియోజకవర్గాల్లో రోడ్‌షోల్లో పాల్గొననున్న కేటీఆర్



ఖమ్మం, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం విస్తృతంగా పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉదయం నేరుగా భద్రాచలం పట్టణానికి చేరుకుంటారు. 11 గంటలకు శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకుంటారు. అనంతరం బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి తెల్లం వెంకట్రావు విజయాన్ని ఆకాంక్షిస్తూ పట్టణంలో నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇల్లెందు పట్టణానికి చేరుకుంటారు. అక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్ విజయాన్ని కాంక్షిస్తూ రోడ్‌షో నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2:30 గంటలకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం చేరుకుంటారు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు అశ్వారావుపేటకు చేరుకుంటారు. అక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించిన కొద్ది రోజులకే మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారానికి వస్తుండడంతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. కాగా, మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంత చేయాలని ఎమ్మెల్సీ తాతా మధు పార్టీ శ్రేణులకు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# నిరంతర శ్రామికుడిని మళ్లీ గెలిపించండి

- సండ్ర వెంకటవీరయ్యకు అధిక మెజార్టీ అందించండి..
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో అద్భుతంగా సత్తుపల్లి అభివృద్ధి
- తల్లాడ ప్రచారంలో రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి
- ప్రభుత్వానికి అండగా ఉండాలి: సండ్ర, సంభాని, కొండూరి


అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర, చిత్రంలో పార్థసారథిరెడ్డి, సంభాని

తల్లాడ, నవంబర్ 18: నిరంతర శ్రామికుడిగా, ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను మరోసారి కూడా గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల మధ్యనే ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్న ఆయనకు భారీ మెజార్టీ అందించాలని కోరారు. తల్లాడ మండలంలో శనివారం పర్యటించిన ఆయన.. బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య, పార్టీ నేతలు సంభాని చంద్రశేఖర్, కొండూరి సుధాకర్‌లతో కలిసి నూతనకల్, గూడూరు, కొత్తవెంకటగిరి, రామచంద్రాపురం, బిల్లుపాడు, అంజనాపురం, తెలగవరం, అన్నారుగూడెం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధికి చేశారని గుర్తుచేశారు. సుమారు రూ.1,000 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేసి చూపించిన ఘనత సండ్రకే దక్కుతుందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు సంభాని చంద్రశేఖర్, కొండూరి సుధాకర్ మాట్లాడుతూ.. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ గెలుపు, నాలుగోసారి ఎమ్మెల్యేగా సండ్ర గెలుపు ఎప్పుడో ఖాయమైందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆయనకు భారీ మెజార్టీ అందించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారికి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన తనను నియోజకవర్గ ప్రజలు నాలుగోసారి కూడా ఆశీర్వదించాలని కోరారు. కాగా, బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రాయల శేషగిరిరావు, దొడ్డా శ్రీనివాసరావు, దిరిశాల ప్రమీల, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్, దూపాటి భద్రరాజు, దిరిశాల దాసురావు, కేతినేని చలపతిరావు, బద్ధం కోటిరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, ఓబుల సీతారామిరెడ్డి, మోగునూరి సంతోషం, తేలపుట్ల కృష్ణయ్య, తూము శ్రీనివాసరావు, తూము వీరభద్రరావు, నాయుడు శ్రీనివాసరావు, కోపెల కనకయ్య, రుద్రాక్షల బ్రహ్మం, బాణోతు మోహన్, వరపర్ల ఉదయ్, అయిలూరి శివారెడ్డి, దూపాటి నరేశ్‌రాజు, వనిగండ్ల అశోక్, దొడ్డ చిన్న శ్రీను పాల్గొన్నారు.

## ఇల్లెందులో గులాబీ జెండా ఎగరేద్దాం

- ఇక్కడి విజయాన్ని సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం
- కామేపల్లి పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ
- కాంగ్రెస్ కంచుకోటలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం
- మాజీ మంత్రి రాంరెడ్డి స్వగ్రామంలో జననీరాజనం


హారతి పడుతున్న గిరిజన మహిళలు


కారేపల్లి (కామేపల్లి), నవంబర్ 18: ఇల్లెందు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరేద్దామని బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గంలో విజయం సాధించి దానిని సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని అన్నారు. కామేపల్లి మండలంలో శనివారం పర్యటించిన ఆమె.. నెమలిపురి, పాత లింగాల, పింజరమడుగు, తాళ్లగూడెం, టేకులతండా, జాస్తిపల్లి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతీ ఒక్కరూ మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు భారీ మెజార్టీ అందించాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే హరిప్రియ ఆయా గ్రామాల్లో కూలీలతో కలిసి కొద్దిసేపు పత్తి తీశారు. ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ కంచుకోటలో బీఆర్ఎస్ ప్రచారం..**

అది కుగ్రామం. కానీ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. ఆ గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా ఇతర పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహించిన దాఖలాలు లేవు. ఒకవేళ ఇతర పార్టీలు ఆ గ్రామానికి వచ్చినా గ్రామస్తుల నుంచి స్పందన ఉండదు. అదే మాజీ మంత్రి, దివంగత కాంగ్రెస్ నేత రాంరెడ్డి వెంకట్‌రెట్టి స్వగ్రామం పాత లింగాల. ఆ ఊరు మొత్తం కూడా గత ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీకి తప్ప మరి ఏ పార్టీలకూ ఓటు వేసిన దాఖలాలు లేవు. కానీ ఈసారి ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్ శనివారం తొలిసారిగా పాత లింగాలలో అడుగుపెట్టారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనికి గ్రామస్తులు కూడా నీరాజనం పలికారు. హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. మరికొందరు గ్రామస్తులైతే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి కొనసాగింపు

- పనిచేసే కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించండి
- కూసుమంచి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ
- సంక్షేమంలో తెలంగాణది మొదటిస్థానం: సంభాని


బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ప్రచార రథంపై పార్టీ శ్రేణులు కురిపిస్తున్న గులాబీ జెండాలు

కూసుమంచి, నవంబర్ 19: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి కొనసాగుతుందని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పనిచేసే కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్‌కు మనమందరమూ అండగా నిలవాలని కోరారు. అందుకోసం ఈ నెల 30న జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కూసుమంచి మండలంలో శనివారం పర్యటించిన ఆయన.. జీళ్లచెరువు గ్రామంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సంభాని చంద్రశేఖర్‌తో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు తన సొంత నిధులు కూడా వెచ్చించి పాలేరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని వివరించారు. నియోజకవర్గ మరింత అభివృద్ధి కోసం ప్రజలందరూ మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశంలో సంక్షేమ రంగంలో తెలంగాణను మొదటిస్థానంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మళ్లీ మళ్లీ గెలిపించాలని కోరారు. డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ మాట్లాడుతూ.. తాము పార్టీ కోసం పని చేశామని, ఉపేందర్‌రెడ్డి గెలుపు కోసం ఎల్లవేళలా పని చేస్తామని అన్నారు. జడ్పీటీసీ ఇంటూరి బేబీ మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ అందరికీ సంక్షేమ పథకాలు అందించే ఉపేందర్‌రెడ్డి ఓటు వేయాలని కోరారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు కలిసి కందాళకు క్రేన్ సహాయంతో గజమాలను వేశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. గులాబీ జెండాలతో జీళ్లచెరువు సెంటర్‌ను పూర్తిగా అలంకరించారు. నాయకులు చంద్రావతి, తాళ్లూరి జీవన్, రామసహాయం బాలకృష్ణారెడ్డి, బానోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.